క్లుప్తంగా

లలితా హాస్పిటల్స్‌లో నేడు అవగాహన సదస్సు



డాక్టర్ పమిడి ముక్కల విజయ


గుంటూరు మెడికల్: పక్షవాతం తరువాత జీవితాన్ని తిరిగి పొందడం ఎలా అనే అంశంపై గుంటూరు లలితా సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు లలితా గ్రూప్ ఆఫ్ హాస్పటల్స్ అధినేత, ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ పమిడి ముక్కల విజయ తెలిపారు. గుంటూరు కొత్తపేటలోని గణేష్‌మహల్ పక్కన ఉన్న లలితా పీవీఎస్ ప్రాంగణంలో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అవగాహన సదస్సు జరుగుతోందన్నారు. అక్టోబరు నెల పక్షవాత అవగాహన సందర్భంగా ప్రత్యేక స్ట్రోక్ సర్వేయర్స్ అండ్ కేర్ గివర్స్ మీట్ అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పక్షవాతం నుంచి కోలుకుంటున్న వారు కార్యక్రమంలో పాల్గొని తాము పక్షవాతం నుంచి కోలుకున్న జర్నీ గురించి వివరించి, ఇతరులకు ప్రేరణగా మారుతారన్నారు. రోగులు, వారి కుటుంబ సభ్యులు రికవరీ మార్గాల గురించి, రోజువారి జీవన శైలిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుసుకునేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సామాజిక, ఉద్యోగ, శారీరక, మానసిక, ఆరోగ్య సమస్యలపై అవగాహన పొందుతారన్నారు. స్ట్రోక్ సర్వైవర్స్ రోల్ మోడల్‌గా మారి ఇతరులకు ప్రేరణ కల్పిస్తారన్నారు. పక్షవాతం నుంచి కోలుకున్న వారి కథనాలు, అనుభవాలు, నిపుణులతో పక్షవాతం, బ్రెయిన్ హెల్త్‌పై అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. సందేహాల నివృత్తి, ఉచిత ఫిజియోథెరఫీ, డైట్ కౌన్సిలింగ్ ఉంటుందన్నారు. పక్షవాతం రోగులు, వారి కుటుంబ సభ్యులు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని డాక్టర్ విజయ కోరారు. కార్యక్రమంలో న్యూరాలజిస్టులు డాక్టర్ వీరమ్మ, డాక్టర్ రేష్మ, డాక్టర్ ఉషాకిరణ్ బెహరా, డాక్టర్ భార్గవిదేవీ, డాక్టర్ అజ్మనాజ్, న్యూరో సర్జన్లు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ సుజన, సైకాలజిస్టులు డాక్టర్ అజయ్, డాక్టర్ సరోజ, జనరల్ మెడిసిన్ వైద్యులు, లైఫ్ స్టైల్ కౌన్సిలర్లు, ఫిజియోథెరఫీ వైద్యులు, ఫిజియోథెరపిష్టులు పాల్గొని స్ట్రోక్ గురించి సందేహాలు నివృత్తి చేస్తారన్నారు. పక్షవాతం గురించి ప్రతి ఒక్కరూ ముందస్తుగా తెలుసుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చు అన్నారు. ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9490759378 నంబరులో సంప్రదించాలన్నా డాక్టర్ విజయ కోరారు.

సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై రంగోలి పోటీలు



లక్ష్మీపురం: సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ గుంటూరు ఉత్సవ్‌ను ఈ నెల 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో రంగోలి పోటీలను బుధవారం నిర్వహించారు. జీఎస్టీ జాయింట్ కమిషనర్ బి.గీత మాధురి, సహాయ కమిషనర్ ఆర్.అనసూయ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు జిల్లా ఉత్సవ్‌ను జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు గురువారం ప్రారంభిస్తారన్నారు. ఉత్సవ్‌కు ప్రత్యేకంగా లోగో తయారు చేయడం జరిగిందని చెప్పారు. జీఎస్టీ 2.0 పై వినియోగదారులకు పూర్తి అవగాహన కల్పించేందుకు ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు గుంటూరు జిల్లా ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుంటూరు ఏసీ కళాశాల ఆడిటోరియం హాల్‌లో ఉత్సవ్ జరుగుతుందని అన్నారు. 16వ తేదీ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఎగ్జిబిషన్, అమ్మకాలు జరుగుతాయన్నారు. గృహోపకరణాలు, క్రీడా పరికరాలు, జిమ్ ఫిట్నెస్, సోలార్, బుక్స్ స్టేషనరీ, కెమిస్ట్ డ్రగ్గిస్ట్, అన్ని రకాల ఎలక్ట్రానిక్స్ వస్తువులు తదితర వాటికి సంబంధించిన దాదాపు 70 స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు.

సైబర్ క్రైమ్స్‌తో కుటుంబాలు చిన్నాభిన్నం



గుంటూరు ఎడ్యుకేషన్: సైబర్ క్రైమ్స్ కారణంగా కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని సైబర్ సెక్యూరిటీ విభాగ సీఐ నిస్సార్ బాషా పేర్కొన్నారు. బుధవారం సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో యువజన సర్వీసుల శాఖ, స్టెప్ స్వశక్తి ఆధ్వర్యంలో "సైబర్ సెక్యూరిటీ, డ్రగ్ అబ్యూస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న నిస్సార్ బాషా మాట్లాడుతూ ఫేస్‌బుక్, ఇనస్టాగామ్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా మహిళలతో పరియచం పెంచుకునే అపరిచిత వ్యక్తులు సోషల్ మీడియా అకౌంట్లను హ్యాక్ చేసేందుకు ప్రయత్నిస్తారని, ఈ విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొత్తపేట సీఐ ఎం.వీరయ్య మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా అనైతిక చర్యల పరిధిలోకి వస్తాయని, ఇందుకు చట్టంలో పొందుపర్చబడిన సెక్షన్లు, శిక్షలను వివరించారు. సదస్సులో ఎస్సై రమేష్, స్టెప్ జిల్లా మేనేజర్ బి.రాధిక, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సృజనాత్మక ఆవిష్కరణలకు నాంది పలకాలి

- డీఆర్‌డీవో శాస్త్రవేత్త, ఆర్‌సీఐ మాజీ డైరెక్టర్ డాక్టర్ సుబీర్‌కుమార్ చౌదరి
- ఆర్‌వీఆర్‌జేసీలో భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్‌కలాం జయంతి



మాట్లాడుతున్న డాక్టర్ సుభీర్‌కుమార్ చౌదరి



కలాం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రామప్రసాద్, మలినేని పెరుమాళ్లు

గుంటూరు రూరల్: ఇండియాను ఇన్నోవేషన్ హబ్‌గా మార్చే దిశగా విద్యార్థులు సృజనాత్మక ఆవిష్కరణలకు నాంది పలకాలని, భారత విజ్ఞాన ప్రగతికి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మార్గదర్శకులని డీఆర్‌డీవో శాస్త్రవేత్త, ఆర్‌సీఐ మాజీ డైరెక్టర్, డాక్టర్ అబ్దుల్ కలాం సహ ఉద్యోగి డాక్టర్ సుబీర్‌కుమార్ చౌదరి తెలిపారు. బుధవారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్‌కలాం జయంతిని పురస్కరించుకుని జాతీయ ఆవిష్కరణ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో కలాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేసిన క్షిపణి, అణు కార్యక్రమాలలో జరిపిన ప్రయోగాలను అంతరిక్ష పరిశోధనా రంగంలో తొలి నాటి నుండి, నేటి వరకు సాధించిన విజయాలను విద్యార్థులకు వివరించారు. అంతరిక్ష పరిశోధనా రంగ ప్రగతిలో భారత్ వేగంగా పురోగతి సాధిస్తూ ప్రపంచ అగ్రదేశాల సరసన నిలిచిందని, డిజిటల్ ఎకానమీ పెంచుతూ గ్లోబల్ టెక్నాలజీ లీడర్‌గా భారత స్థానాన్ని సుస్థిరం చేసేందుకు యువ ఇంజినీర్లు సృజనాత్మక ఆలోచనలతో పరిశోధన, ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. హీలెక్స్ సంస్థ కో-ఫౌండర్ సీ.ఈ.ఓ డాక్టర్ పొలమీచౌదరి మాట్లాడుతూ స్టార్టప్‌లు నూతన ఆవిష్కరణలు భారత యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలు కల్పిస్తాయని తెలిపారు. ఆవిష్కరణలు దేశ ప్రగతికి మూలాధారాలని, యువ ఇంజనీర్లు సాంకేతికతను సమాజ శ్రేయస్సు దిశగా మలచాలని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు పరిశోధన పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని, అబ్దుల్ కలాం గుంటూరు నగర పర్యటనకు వచ్చిన సందర్భంలో సాంకేతిక సృజనాత్మకతతో తమ కళాశాల విద్యార్థులు సాధించిన అనేక విజయాలపై అభినందించారని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎంపీపీ చంద్రశేఖర్‌రావు, డాక్టర్ హఫీజ్‌బాషా, డాక్టర్ శోభ, డాక్టర్ రాధిక, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి అబ్దుల్ కలాం

ప్రత్తిపాడు: యువతకు స్ఫూర్తి అబ్దుల్ కలాం అని రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ డాక్టర్ ఎస్.వి.ఆర్. రామప్రసాద్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం అబ్దుల్ కలాం జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రోటరీ గవర్నర్ డా.ఎస్.వి.ఆర్. రామప్రసాద్, కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన భారత మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం అట్టహాసంగా ఫ్రెషర్స్ డే - 2025 వేడుకలను నిర్వహించారు. విద్యార్థులకు క్రీడా పోటీలు జరిగాయి. అదేవిధంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. సహపాఠ్య కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం బహుమతులు అందజేసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రామప్రసాద్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం చూపిన మార్గంలో విద్యార్థులు పయనించాలన్నారు. విద్యార్థులు సేవాభావాన్ని అలవరుచుకోవాలని సూచించారు. కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ విద్యార్థులు సమాజసేవలో భాగస్వాములు కావాలన్నారు. హ్యాకథాన్‌లు, కాంపిటీషనుల విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఉపకరిస్తాయన్నారు. విద్యార్థులు నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా. కె. వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ డా. జెట్టి అప్పారావు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ నిరులలో ఎంటర్ పెన్యూర్‌షిప్ వర్క్‌షాప్



గుంటూరు రూరల్: పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరులా మహిళా ఇంజనీరింగ్ కాలేజ్‌లో బుదవారం ఐఐటీ ముంబాయ్ సహకారంతో ఇల్యూమినేట్ ఎంపవరింగ్ ది నెక్స్ట్ జనరేషన్ ఆఫ్ చేంజ్ మేకర్స్ పేరుతో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్మెంట్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హెడ్ సెంటర్ ఫర్ ఇన్నోవేషన్, ఇన్‌క్యుబేషన్-ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మంతెన శివపవన్‌కుమార్‌రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్క్‌షాప్‌లో విద్యార్థులకు వ్యాపార ఆవిష్కరణలు, స్టార్టప్ ప్రారంభ దశలో అవసరమయ్యే నైపుణ్యాలు, ఆలోచనలను వ్యాపార అవకాశాలుగా మలచుకోవటం వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాధిక మాట్లాడుతూ వర్క్‌షాప్‌లు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని, ఆవిష్కరణా దృక్పథాన్ని పెంపొందిస్తాయన్నారు. భవిష్యత్తులో స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకునే దిశగా ముందుకు సాగేందుకు ప్రేరణ కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ విజయ, ఇంట్రిప్రెనేర్షిప్ డెవలప్మెంట్ సెల్ కోఆర్డినేటర్, విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ తులసి



మాట్లాడుతున్న మేనేజరు తులసి

పొన్నూరు: మండలంలోని ములుకుదురు, చింతలపూడి, మునిపల్లె, వెల్లలూరు రైతు సేవా కేంద్రాల్లో బుధవారం ఖరీఫ్ వరి ధాన్య సేకరణ కొనుగోలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులకు అవగాహన కల్పించినారు. కార్యక్రమంలో సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ తులసి పాల్గొని రైతులకు ధాన్యం కొనుగోలులో అనుసరించాల్సిన పద్ధతులు వివరించారు. కనీసం 17శాతం తేమ వుండే విధంగా ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు నమూనా తీసుకురావాలని సూచించారు. గోతాలు, ట్రాన్స్‌పోర్టు ఖర్చులు ప్రభుత్వమే అందిస్తుందని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి ఆర్. వెంకటేశ్వరావు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ. 1792 (75 కేజీల బస్తాకు) ప్రకారం కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఐ. శ్రీకాంత్, వ్యవసాయ సహాయకులు సి.హెచ్. భానురేఖ, పి.దుర్గా, సుప్రజ, ఎ.భావన, ఎంపీఈఓ ఎస్. సురేష్ బాబు, రైతులు పాల్గొన్నారు.

చలపతిలో టెక్ నిర్వాణ టెక్‌ఫెస్ట్



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా, కళాశాల సంయుక్తాధ్వర్యంలో జాతీయస్థాయి టెక్‌నిర్వాణ టెక్‌ఫెస్ట్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ యూనివర్శిటీ స్ట్రాటజీ డైరెక్టర్ ఎస్.చందన మాట్లాడుతూ సాంకేతిక ఫెస్ట్‌లు విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఉపయోగపడతాయన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ టెక్నికల్ ఫెస్ట్‌లో విద్యార్థులకు ప్రామ్ట్ బ్యాటిల్, టెక్నికల్ క్విజ్, పేపర్ ప్రజంటేషన్, మీమ్ పోస్టర్ ప్రజంటేషన్ తదితర పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశామన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ సుజిత్‌కుమార్, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ ఎ.బాలాజీ అధ్యాపకులు తదితరులు అతిదులను ఘనంగా సన్మానించారు.

3 నుంచి సెల్‌ఫోన్ సర్వీసింగ్‌లో ఉచిత శిక్షణ

కొరిటిపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నవంబర్ 3వ తేదీ నుంచి సెల్‌ఫోన్ రిపేర్ అండ్ సర్వీసింగ్, జూట్ వస్తువుల తయారీ, 17వ తేదీ నుంచి టైలరింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ టి.సందీప్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెల్‌ఫోన్ రిపేర్, టైలరింగ్‌లలో శిక్షణ 30 రోజులు, జూట్ వస్తువుల తయారీలో 14 రోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణా కాలంలో ఉచిత భోజన సదుపాయంతో పాటు, హాస్టల్ వసతి కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. వయస్సు 19 నుంచి 45 సంవత్సరాల లోపు, 10వ తరగతి చదివి ఉండాలని ఉండాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్, నాలుగు పాస్‌పోర్టుసైజు ఫోటోలతో ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగులు, యువతులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ, ఓల్డ్‌బ్యాంక్ వీధి, కొత్తపేట, 0863-2336912, 9700687696, 8125397953, 9949930155 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

నాటక రంగం అభివృద్ధికి కృషి

- ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ
- ప్రారంభమైన నాటకోత్సవాలు



ఓ కాశీవాసి రావయ్య నాటకంలో దృశ్యం

నగరంపాలెం: నాటక రంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ అన్నారు. మంత్రిత్వ సాంస్కృతిక కేంద్రం, ఏపీ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి అభినయ (పొనుగు పాడు), ఠాగూర్ మెమోరియల్ ట్రస్ట్ సంయుక్తంగా మూడు రోజులపాటు జరగనున్న నారా చంద్రబాబు నాటకోత్సవం-2025 బుధవారం మార్కెట్ కూడలిలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ప్రారంభమయ్యాయి. అతిథులు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించగా, ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ సభాధ్యక్షత వహించి మాట్లాడారు. కోకా విజయలక్ష్మి బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అలరించింది. అనంతరం ఓ కాశీవాసి రావయ్య, బంధం నాటకాలు ప్రదర్శించారు. రెండు నాటకాలు సభికులను అలరించాయి. కార్యక్రమంలో అభినయ నిర్వాహకులు శ్రీనివాస్, రెడ్‌క్రాస్ సొసైటీ కోశాధికారి పి.ఆర్.రాజు, రామరాజు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, అభినయ థియేటర్ ట్రస్ట్ సలహాదారులు జొన్నలగడ్డ శ్రీనివాసరావు, డాక్టర్ జొన్నలగడ్డ శిరీష, టీడీపీ మహిళా అధికార ప్రతినిధి (నరసరావుపేట) కనుమూరి అనంతలక్ష్మీ, ఏపీ రచయితల సంఘం అధ్యక్షుడు జానీభాషా పాల్గొన్నారు.

అలరించిన అన్నమాచార్య సంకీర్తనలహరి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై బుధవారం అన్నమాచార్య సంకీర్తన లహరి నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో జరగ్గా, ఆలయ పాలక మండలి వారు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. భారత పూర్వ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా కలాం జీవిత విశేషాలు, విజయాలను సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మీ వివరించారు. అనంతరం డాక్టర్ జె.కృష్ణకుమారి పర్యవేక్షణలో మోహనగానం వైకుంఠమే సంస్థ సభ్యు లు అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. రుక్మిణి వరప్రసాద్, సునీత, రమణి, ఇందు తమ గాత్రధారణలో అదివో అల్లదివో, కొండలలో నెలకొన్న వంటి ప్రసిద్ధ కీర్తనలను ఆలపించగా, ప్రేక్షకులను మెప్పించాయి. కీబోర్డుపై సాయి, తబలాపై రమణ వాయిద్యాన్ని అందించారు. కార్య క్రమంలో మహిళా విభాగం కోశాధికారిణి డాక్టర్ మైలవరపు లలితకుమారి, సభ్యులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



పొన్నూరు: గుండె కొట్టుకోవడం ఆగిపోవడం, శ్వాస అందని అత్యవసర సమయాల్లో సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడుకోవచ్చని డాక్టర్ వంశీ సూచించారు. సీపీఆర్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజల భద్రత, అత్యవసర సేవలకు ప్రాధాన్యతనిస్తూ సిపిఆర్ (కార్డియోపల్మనరీ రిససిటేషన్) శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వంశీ మాట్లాడుతూ గుండె ఆగిపోయిన సందర్భాలలో సీపీఆర్ ఎంత కీలకమో వివరించారు. సరైన సమయంలో సీపీఆర్ అందించడం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చని, ముఖ్యంగా సాధారణ ప్రజలు ఈ నైపుణ్యాన్ని తప్పనిసరిగా నేర్చుకోవాలని కోరారు. ఛాతీ కుదింపులు, కృత్రిమ శ్వాస అందించే విధానాన్ని శిక్షకులు నేర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం అందించే సామర్థ్యం పెరుగుతుందని, పౌరులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, రెడ్ క్రాస్ సంస్థ సిబ్బంది, వైద్యులు, వార్డు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారుల్లో గుంతలు పూడ్చాలి

అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి విజ్ఞప్తి

లక్ష్మీపురం: గుంటూరు నగరంలో, జిల్లాలోని రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, ప్రధాన రోడ్ల మీద గుంటలనైన పూడ్చే ఏర్పాటు చేయాలని అవగాహన సంస్థ తరుపున విజ్ఞప్తి చేస్తున్నామని సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి తెలిపారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ ప్రాంతాలకు పోయే రోడ్లు చాలా దారుణంగా ఉన్నాయని, గుంతల పూడ్చివేతకు ఎన్ని కోట్లు ఖర్చు పెట్టినా ఉపయోగం ఉండటం లేదన్నారు. వాహనదారులు ఇక్కట్లు పాలవుతునే ఉన్నారని విమర్శించారు. గత పది సంవత్సరాలుగా వేయని రోడ్లు గుంటూరు జిల్లాలోనే వందల సంఖ్యలో ఉన్నాయని, ఈ ప్రభుత్వం వచ్చిన తరువాతనైనా రోడ్లు బాగుపడతాయని ప్రజలు ఆశించారని, అయితే ఒక 10 శాతం రోడ్లు వరకే గుంతలు పూడ్చడం, రోడ్లు వేయటం వంటి వాటి పై దృష్టి సారించాల్సిందిగా తెలిపారు. జిల్లా వాసులు రోజూ ఈ రోడ్ల మీద ప్రయాణిస్తూ మృత్యువాత పడుతున్నారని ఆరోపించారు. ఆసుపత్రుల పాలవుతున్నారని, కురుస్తున్న భారీ వర్షాల వల్ల జిల్లా వాసులు నరకం చవి చూస్తున్నారన్నారు. కొత్తగా వేస్తున్న రోడ్లు నాణ్యతగా ఉండటం లేదని, రహదారుల పై భాగం వర్షాలకు, ఎండకు దెబ్బతింటుందని, నీరు పారేందుకు వాలు సరిగ్గా లేకపోవడం వల్ల రోడ్ల మీదనే మోకాలు లోతు నీరు నిల్వ ఉండి ఇక్కట్లు పాలవుతున్నారని తెలిపారు.

ఆదర్శానికి రోటరీ ఆసరా

శారీరక వైకల్యం గల వధూవరులకు రోటరీక్లబ్ ఆర్థిక సహాయం



కొత్త దంపతులకు ఆర్థిక సహాయం అందిస్తున్న తిలక్‌బాబు, వెంకటకృష్ణ, రఘునాథ్

గుంటూరు ఎడ్యుకేషన్: పుట్టుకతో చెవుడు, మూగ సమస్యతో బాధపడుతున్న అబ్బాయి, అమ్మాయి నూతన దంపతులయ్యారు. వేర్వేరు ప్రాంతాల్లో జన్మించిన వారిని విధి ఒక్కటిగా కలిపింది. వీరి కుటుంబాల్లోని ఆర్థిక ఇబ్బందులను తెలుసుకున్న రోటరీక్లబ్ ఆర్థిక సహాయాన్ని అందజేసింది. అచ్చంపేట మండలం కోనూరు గ్రామానికి చెందిన బొగ్గవరపు సుబ్రహ్మణ్యం, సౌభాగ్య లక్ష్మి దంపతులకు ఒక అబ్బాయి.. ఒక అమ్మాయి. అమ్మాయికి వివాహం కాగా, అబ్బాయి మణికంఠ శ్రీనివాసు పుట్టుమూగ చెవుడుతో ఉండి అవివాహితునిగా ఉన్నాడు. అనారోగ్యం కారణంగా సుబ్రహ్మణ్యంకు ఒక కిడ్నీ తీసివేయగా, సౌభాగ్య లక్ష్మి ఇటీవల ఫేషియల్ పెరాలసిస్‌కు గురయ్యారు. దీంతో వారి కుటుంబం కష్టాల సుడిగుండంలోకి నెట్టి వేయబడింది. తల్లిదండ్రుల కోరిక మేరకు వివాహం చేసుకునేందుకు నిర్ణయించుకున్న మణికంఠ శ్రీనివాసు కుటుంబానికి ఒక మంచివార్త తెలిసింది. విజయవాడకు చెందిన జానపాటి కమల, నెహ్రూహా దంపతులకుమూగ, చెవుడు లోపం కలిగిన అమ్మాయి ఉందని తెలుసుకుని, కులాలు వేరైనా ఇరు కుటుంబాలు ఇద్దరికి వివాహం చేసేందుకు నిశ్చయించారు. అయితే ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోవడంతో అదే గ్రామానికి చెందిన వాసిరెడ్డి రెడ్డి రవిని సంప్రదించారు. ఆయన రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అచీవర్స్ సభ్యులకు వివరించి ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు. దీనిపై స్పందించిన అచీవర్స్ మాజీ ప్రెసిడెంట్ పిడికిటి తిలక్ బాబు, సభ్యుడు నెలకుదిటి వెంకటకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ గుంటుపల్లి రఘునాథ్, కార్యదర్శి గోనుగుంట్ల వెంకట్, కోశాధికారి కటకం రాజేష్, డాక్టర్ కపిల్, కొల్లా శ్రీనివాస్, ప్రదీప్ కొత్త దంపతులకు రూ.25వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. బుధవారం గుంటూరు విద్యానగర్‌లోని ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో తిలక్ బాబు మాట్లాడుతూ ఈ ఆదర్శ జంటకు చేయూత ఇవ్వడం మిక్కిలి ఆనందంగా ఉందని అన్నారు. భవిష్యత్ లో రోటరీ మరిన్ని కార్యక్రమాలు చేయనుందని, తోటి సభ్యుల సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ రమేష్, వాసిరెడ్డి రవి, నూతన దంపతుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జీఎస్టీ సేవింగ్స్‌పై అవగాహన పెంచుకోవాలి



వేణుగోపాలరావును సత్కరించిన అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: జీఎస్టీ సంస్కరణలతో కలిగే ప్రయోజనాలపై అవగాహన పెంచుకోవాలని జీఎస్టీ మాజీ సహాయ కమిషనర్ ఆర్. వేణుగోపాలరావు తెలిపారు. బుధవారం జేకేసీ కళాశాలలో కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగాల ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ 2.0లో ప్రవేశపెట్టిన సంస్కరణలు, పన్ను రేట్లపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వేణుగోపాలరావు మాట్లాడుతూ వ్యక్తిగత ఆర్థిక నిర్వహణ, రిటర్న్స్ ఫైలింగ్, బడ్జెట్ రూపకల్పన, పొదుపు, పెట్టుబడుల ప్రాధాన్యత, డిజిటల్ ఫైనాన్స్ టూల్స్ వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆర్థిక అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగాధిపతి ఎం.అప్పారావు, సమన్వయకర్త కె. చరణ్‌చౌదరి, అధ్యాపకులు కె.అంజనీదేవి, ఎ. వెంకటకృష్ణ, కె.వీణ, కె. అరుణ్‌కుమారి, యు.వెంకటేశ్వరరావు, కె. కల్పన, విద్యార్థులు పాల్గొన్నారు.

• మార్గమంతా కంకర రాళ్లే!



మెడికల్ క్లబ్ పక్కనే ఉన్న రహదారి అధ్వానంగా మారింది. రాకపోకలకు అనువుగా లేకపోవడంతో చోదకులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రహదారి మీదగా వయా ఏటీ అగ్రహారం, చుట్టుగుంట, కలెక్టరేట్ బంగ్లా రోడ్డు వెళ్లేందుకు ఎక్కువగా రాకపోకలు చేస్తుంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో రహదారి రద్దీగా ఉంటుంది. అయితే రహదారిలో కొంతమేర కంకరరాళ్లు పైకి లేచి అధ్వానంగా మారాయి. ఏమాత్రం ఏమరుపాటుగా వెళ్లినా ఆస్పత్రికి చేరాల్సిన పరిస్థితులు ఇక్కడ ఉన్నాయి. చాలామంది ప్రమాదవశాత్తు కిందపడి స్వల్పంగా గాయపడుతున్న ఘటనలు లేకపోలేదు. రోడ్డును తారుతో నిర్మించాలని పలుమార్లు జీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు వాహదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీఎంసీ అధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరుతున్నారు.

-నగరంపాలెం

క్రైస్తవులకు రక్షణ చట్టం అమలు చేయాలి

- 30న చలో కలెక్టరేట్
- క్రైస్తవ సంఘాల పాస్టర్లు పిలుపు

నెహ్రూ నగర్: క్రైస్తవులకు రక్షణ చట్టం అమలు చేయాలని కోరుతూ ఈనెల 30న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు క్రైస్తవ సంఘాల పాస్టర్లు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం అరండల్ పేటలోని ఓ హోటల్ లో క్రైస్తవ సంఘాల పాస్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజికవేత్త డాక్టర్ గొల్లమూడి రాజ సుందరబాబు మాట్లాడుతూ క్రైస్తవులకు ప్రత్యేక పరిరక్షణ చట్టం చేయడంతో పాటు, పాస్టర్లకు గౌరవ వేతనం రూ 25 వేలకు పెంచాలని, క్రైస్తవులకు సమాధుల తోటలకు భూములు మంజూరు చేయాలని, ఇతర 16 డిమాండ్లతో ఈ నెల 30న ఉదయం 10 గంటలకు నగరంపాలెంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రైస్తవ విశ్వాసులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని. ఈ కార్యక్రమంలో పాస్టర్లు లాభాను సుకుమార్, సురేష్, సుందర్ సింగ్, భారతి, పండు, డేవిడ్ విలియమ్స్, గద్దం సురేష్ తదితరులు పాల్గొన్నారు.